సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులు పూర్తిచేయాలి
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరాటౌన్, ఫిబ్రవరి 24: ఏన్కూరు మండల కేంద్రంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులతో పాటు సొరంగం మార్గ పనులను వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్యాస్ పైప్‌లైన్‌లు నిర్మాణం అడ్డంకిగా ఉండడంతో టన్నెల్ నిర్మాణం తప్పనిసరిగా నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో టన్నెల్ నిర్మాణం కొరకు పనులు జరుగుతున్న ప్రదేశంలో భారీ బండ రాళ్ళు అడ్డుపడడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, సాధ్యమైనంత మేర పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వాతావరణం సహకరించక వర్షాలు సకాలంలో పడకపోయినా సాగర్ జలాలు ఈ జిల్లాకు రాకపోతే ప్రత్యామ్నాయ మార్గంగా సీతారామ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని, సాగు,తాగునీటికి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

టెన్నిస్ కోర్టులో మంత్రి తుమ్మల

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 24: ఖమ్మం పటేల్ స్టేడియంలో మంత్రి తుమ్మల కొద్ది సేపు సందడి చేశారు. సోమవారం రాత్రి 7 గంటలుల సమయంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొన్న వేళ స్టేడియానికి వచ్చిన ఆయన.. అక్కడ చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను సందర్శించారు. అక్కడి క్రీడాకారులకు అభివాదం చేసిన అనంతరం వారితో కలిసి కొద్దిసేపు టెన్నిస్ ఆడారు.

క్రాంతి జూ.కళాశాలలో వార్షికోత్సవ వేడుక

వైరాటౌన్, ఫిబ్రవరి 24: స్థానిక క్రాంతి జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుక జరిగింది. ఈ సందర్భంగా విద్యా సంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ.. అపారమైన అనుభవం గల అధ్యాపకులతో విద్య అందిస్తున్నామని తెలిపారు. వాసిరెడ్డి సునీత, సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పివో లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, వేణు, నరేంద్ర, నాగలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

శివుని విగ్రహావిష్కరణ

కొణిజర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని తీగలబంజర శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. తీగలబంజరకు చెందిన గ్రామీణ వైద్యుడు మందా రాము స్థానిక శ్మశానవాటికలో శివుడు, నంది విగ్రహాలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశాడు. ఈ విగ్రహావిష్కరణకు జయ విలాసిని డెవలపర్స్ నిర్వాహకుడు కుంచపు రాంబాబు హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. భూక్యా మీటు, లాల్‌సింగ్, ఏదునూరి శ్రీను, షేక్ దాదాసాహేబ్, సీ.హెచ్.కృష్ణారావు, ఎల్లయ్య, నునావత్ శ్రీను, వెంకటేశ్వర్లు, కట్టా రాంబాబు, బాణోతు శ్రీను, లెనిన్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ వితరణ

కొణిజర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని అన్నవరం అంగన్‌వాడీ కేంద్రానికి అక్కడ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆర్.అచ్యుత్ రూ.20 వేలు విలువైన ఎల్ఈడీ టీవీని ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ద్వారా సోమవారం అందజేశారు. పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ డిజిటల్ ఎడ్యుకేషన్ అందాలనే సంకల్పంతో ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సంప్రదించి వారికి టీవీ అందజేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుడు బాలయేసు సహకారంతో అంగన్‌వాడీ కేంద్రంలోని సుమారు 20 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఉషారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్పావతి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 24 : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్‌ప్రెసిడెంట్ రజాక్ సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ గని మేనేజర్ రాజేశ్వరరావును కోరారు. జేవీఆర్ఓసీలో ఈపీ ఆపరేటర్లు సర్వేడ్ ఆఫ్ దగ్గరలో ఉన్న డంపర్లు నడపడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతనంగా హెచ్ఈఎంఎం మిషనరీ కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు చెన్నకేశవ రావు, గౌస్, క్రాంతికుమార్, సీతారామరాజు, బాలాజీ, రామారావు, నాగేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 24 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నే ఉషాశారద, ఎంపీడీవో బీ.సురేందర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. పలువురు రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, యూడీసీ అభిరామ్, ఎంపీవో శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ ఏసీడీపీవో కృష్ణశ్రీ, మిషన్ భగీరథ ఏఈ ప్రసన్న, ఏఈవో బాలకృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, **REDDIMALLA UPENDAR** (OLD NAME) S/o. **NAGESWARA RAO** R/O.H.No.1-34, Chegomma Village, Main Road, Kusumanchi Mandal, Khammam Dist. Hereby changed my name as **REDDYMALLA UPENDER** (NEW NAME) S/o. **NAGESWARA RAO** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా వేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైన్‌షాపు వద్ద రోడ్డు ప్రమాదం

ముదిగొండ, ఫిబ్రవరి 24 : ముదిగొండలోని వైన్‌షాపుల సముదాయం వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. వైన్‌షాపుల్లో విపరీతమైన రద్దీ ఉండడంతో రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రేపు, ఎల్లుండి వైన్‌షాపులు బంద్ ఉండడంతో మందుబాబులు ఎగబడ్డారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సామాన్య ప్రజలకు నిత్యం ఇబ్బందికరంగా ఉన్న ఈ వైన్‌షాపులను గ్రామం చివరకు తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఆయకట్టు చివరి వరకు నీరందించాలి

నీటి విడుదల షెడ్యూల్‌పై రైతులకు సమాచారం ఇవ్వాలి

టేకులపల్లిలో రైతులతో ముచ్చటించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రైతులతో కలిసి పొలం గట్లపై నడుచుకుంటూ వెళ్తున్న కలెక్టర్

పెనుబల్లి, ఫిబ్రవరి 24: చివరి ఆయకట్టు వరకు రైతుల పంట భూములకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. టేకులపల్లి గ్రామంలో సోమవారం పర్యటించిన కలెక్టర్ పొలం గట్లపై నడుస్తూ రైతులతో ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నీటి విడుదల షెడ్యూల్‌పై ఆయకట్టు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. టెయిల్ ఎండ్ విధానంలో నీటి సరఫరా జరగాలని, ముందుగా చివరి ఆయకట్టుకు నీరు విడుదల కావాలన్నారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సహకార సంఘాల్లో ఎప్పటికప్పుడు నిల్వలను పరిశీలిస్తూ స్టాక్ విషయమై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంతోపాటు పాడి పశువులు పెంచుకుంటే ఆదాయం లభిస్తుందని సూచించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పాఠశాల, ఆసుపత్రి పని తీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జి.సుధీర్, ఎంపీడీవో డి.అన్నపూర్ణ, వ్యవసాయాధికారి ప్రసాద్, శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ ఖాదర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్సుకతను అలవర్చుకోవాలి

పెనుబల్లి, ఫిబ్రవరి 24 : నూతన విషయాలను నేర్చుకోవాలనే ఉత్సుకత విద్యార్థులు అలవర్చుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో పర్యటించి తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడిగా పదో తరగతి విద్యార్థులు కలెక్టర్ సోషల్ స్టడీస్ క్లాస్ తీసుకున్నారు. బెంగాల్ విభజన, ఇండియా మ్యాప్, వాతావరణం వంటి పలు విషయాలను చాక్‌పీస్‌తో బోర్డుపై బొమ్మలు వేస్తూ విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటి సాధన దిశగా నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు. తరగతి గదిలో బాగా చదివే పిల్లలు కొంత వెనుకబడిన పిల్లలకు సహాయం చేయాలని, ఇతరులకు మనం ఒక అంశాన్ని బోధిస్తే ఆ అంశం మనకు బాగా గుర్తుంటుందన్నారు. రాబోయే నెలరోజులపాటు విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని, పూర్తి సమయంలో పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పెనుబల్లి మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీవో అన్నపూర్ణ, అధికారులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఫ్లెక్సీలు తొలగింపు

ఆర్డీవో తీర్పు అనంతరం దిద్దుబాటు చర్యలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్

ఫ్లెక్సీలు తొలగించిన చోటే సమావేశమైన పెద్దాసుపత్రి వైద్యవర్గాలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 24: జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని పాత ధర్నాచౌక్, పార్కింగ్ స్టాండ్‌కు కొందరు ప్రైవేట్ వ్యక్తులు వేసిన పెన్సింగ్‌ను, ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. వారసత్వంగా ఆ స్థలం తమకే చెందుతుందంటూ ఖమ్మానికి చెందిన ఓ కుటుంబం కొద్దిరోజులుగా పోరాటం చేస్తోంది. దానిలో భాగంగానే ఆదివారం ఆ కుటుంబ సభ్యులు ఆ స్థలాన్ని తమ స్వాధీనంలోకి తీసుకుని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' ఆదివారం ప్రచురించిన కథనం వైద్యవర్గాల్లో కదలిక తెచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు సారథ్యంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ బీ.రాంబాబు, మరికొందరు వైద్యులు, ఉద్యోగ జేఏసీ నాయకుడు నందగిరి శ్రీను, సిబ్బంది తక్షణమే స్పందించారు. వారంతా కలిసి ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటుచేసిన పెన్సింగ్‌ను, ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమి ఏమాత్రమూ లేదని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం ప్రజావసరాల నిమిత్తం కేటాయించిన భూమి, సర్వే వివరాలతో కూడిన రికార్డులు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఎవరైనా ఈ దవాఖాన స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్డీవో తీర్పు కోసం వెయిటింగ్..

జిల్లా ప్రభుత్వాసుపత్రికి తూర్పు భాగాన ఖాళీగా ఉన్న స్థలం విషయమై నెలకొన్న వివాదం ఖమ్మం రెవెన్యూ డివిజనల్ కోర్టు పరిధిలోకి వెళ్లింది. తొలుత ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన కుటుంబాన్ని రెవెన్యూ అధికారులు పిలిపించారు. పూర్తి ఆధారాలను సమర్పించాలని సూచించారు. అదేక్రమంలో పెద్దాసుపత్రి వైద్యాధికారులనూ నివేదికలు కోరారు. వీరిరువురి ఆధారాలను పరిశీలించి వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు వెలువరించే అవకాశం ఉంది. ప్రజావసరాల నిమిత్తం ఎప్పుడో కేటాయించిన స్థలమని, ముమ్మాటికీ ప్రభుత్వాసుపత్రికే చెందుతుందని వైద్యవర్గాలు అంటున్నాయి. ఇంతకాలం ఖాళీగా ఉన్నందునే ఇటువంటి సమస్య ఉత్పన్నమైందని, ఆర్డీవో తీర్పు అనంతరం దిద్దుబాటు చర్యలు చేపడతామని దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ అన్నారు. ముందుగా ప్రహరీ గోడను నిర్మిస్తామని, ఆ తర్వాత వైద్యులు, సిబ్బంది, రోగుల అవసరాల నిమిత్తం పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేస్తామని అంటున్నారు. ఈ తరహా ప్రతిపాదనను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గతంలోనే తమకు చెప్పారని, త్వరలోనే చర్యలు చేపడతామని అన్నారు. కాగా, దవాఖాన ముందు భాగంలోని 1,212 చదరపు గజాల స్థలం తమకే దక్కుతుందని, హైకోర్టు తీర్పు సైతం తమకు అనుకూలంగా వచ్చిందని ప్రైవేట్ వ్యక్తులు ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

నర్సిరెడ్డిని గెలిపించాలి

వేంసూరు, ఫిబ్రవరి 24 : ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.వీ.నాగేశ్వరరావు, పౌరస్పందన వేదిక అధ్యక్షుడు వై.రవికుమార్ సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు.

పెనుబల్లి, ఫిబ్రవరి 24 : ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్– ఖమ్మం– నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ కోరారు. సోమవారం పెనుబల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సిరెడ్డిని మరోమారు గెలిపిస్తే ఓటరు గెలిచినట్లేనని అన్నారు.

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 24 : ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్– ఖమ్మం– నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్‌టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పారుపల్లి నాగేశ్వరరావు, వెంగళరావు, కోటారెడ్డి కోరారు. సోమవారం మీనవోలు గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఆయకట్టు చివరి భూములకు సాగునీరు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

కొణిజర్ల, ఫిబ్రవరి 24: సాగర్ ఆయకట్టు చివరి భూముల్లో పంటలు ఎండిపోకుండా వారబందీ సడలింపు లేకుండా పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం రాపల్లె మేజర్ సోమవరం మైనర్ కాలువలపై రైతుసంఘం బృందం పర్యటించి పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు కావడం, మొక్కజొన్న గింజలు అవుతున్న దశలో సాగునీరు ఎక్కువ అవసరం అవుతుందని, దీంతో పాటు ఎండలు తీవ్రత పెరగడంతో సాగునీరు ఒత్తిడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చింతనిప్పు నరసింహారావు, చెరుకుమల్లి పిచ్చయ్య, ఐనాల నాగయ్య, రామారావు, పులి నరసింహారావు, గుమ్మడి నరేష్, పాపగంటి నారాయణ, నగేష్, తెల్లగొర్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాలు కేటాయించాలి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 24 : దళితవాడలకు శ్మశానవాటికల నిమిత్తం స్థలాలు కేటాయించాలని కేవీపీఎస్ పాలేరు డివిజన్ కార్యదర్శి కొమ్ము శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఆ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. దళితులు కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణ, ఆంథోని, బాలరాజ్, నాగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ

వంటగదిని పరిశీలిస్తున్న తహసీల్దార్

బోనకల్లు, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని బోనకల్లు తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలన్నారు. భోజనం తయారీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఎంఈవో దామాల పుల్లయ్య, ఆర్ఐ గుగులోతు లక్ష్మణ్, ఇన్‌చార్జి వార్డెన్ రాణి పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడవద్దు

ఎరువుల వాడకాన్ని పరిశీలిస్తున్న ఏవో

కొణిజర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని ఎన్ఎస్పీ నీరు అందుబాటులో ఉండడం వల్ల రైతులు యాసంగి వరి వేయడానికి మొగ్గు చూపారని, వరి నాటు వేసేది కొన్ని రోజులకు చలి ఎక్కువగా ఉండడం వల్ల పెరుగుదల సరిగా లేక నత్రజని ఎరువులు వేశారని మండల వ్యవసాయాధికారి బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని శివారు వెంకటాపురం గ్రామంలో రైతు రామ్మూర్తి ఎరువులు వేసే విధానాన్ని పరిశీలించారు. రైతులు ఇప్పటికే మోతాదుకు మించి ఎరువులు వేశారని, వివిధ కారణాల వల్ల చీడపీడల ఉధృతి బాగా పెరుగుతుందని, మళ్లీ పురుగుమందులు ఎక్కువ కొట్టుకోవాల్సి వస్తుందని, పెట్టుబడి పెరుగుతుందని, దిగుబడి తగ్గుతుందన్నారు. వరి ఎకరాకు 48 కేజీల యూరియా, 24 కేజీల బాస్వరం, 16 కేజీల పొటాష్ మాత్రమే వేయాలని, కొంతమంది రైతులు యూరియా తక్కువ ధర ఉందికదా అని మోతాదుకు మించి యూరియా ఎక్కువ వాడుతున్నారని, దానివల్ల ఉపయోగం కంటే నష్టం ఎక్కువ ఉంటుందని తెలిపారు.

ఘనంగా లింగమంతుని జాతర

ముదిగొండ, ఫిబ్రవరి 24 : యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుని జాతర మండల కేంద్రం ముదిగొండలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కోలాట నృత్యాలు, డప్పు చప్పుల్లు, డీజే హోరులో మహిళలు బోనమెత్తి గ్రామ శివారులోని పెద్ద గుట్ట వరకూ ర్యాలీగా తరలివెళ్లారు, లింగమంతునికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ, ఎంఎస్పీ నాయకులు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 24 : మండలంలోని అజ్మీరాతండా గ్రామ పంచాయతీలో అంబేద్కర్ చిత్రపటాన్ని కిందపడేసి అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో శిలార్ ఈ విషయమై వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బీఎస్పీ, ఎంఎస్పీ నాయకులు కొమ్ము పూలే, పగిడిపల్లి బాబు పాల్గొన్నారు.

అధ్యాపక దంపతుల పరిశోధనాంశానికి పేటెంట్

అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జాకీరుల్లా

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 24: ఖమ్మంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ బీ.కవిత; ఆమె జీవన సహచరుడు, గతంలో ఈ కళాశాల కెమిస్ట్రీ విభాగంలో పనిచేసి ప్రస్తుతం తొర్రూరులో పనిచేస్తున్న వీ.శాంతికుమార్‌ల పరిశోధనా అంశానికి పేటెంట్ లభించింది. కెలోట్రోపిస్ ప్రోసెరా తెల్లజిల్లేడు మొక్క వేర్ల నుంచి తీసిన రసాయనాన్ని పలు విధాలుగా మార్పులు చేసి బయోలాజికల్ యాక్టివిటీస్ పెంచే అంశంపై కేయూ ప్రొఫెసర్ ఇస్తారి ఆధ్వర్యంలో వీరికి పేటెంట్ వచ్చింది. 2024లో భారత పేటెంట్ కార్యాలయానికి సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నెల 21న కెయూ వీసీ నుంచి సమచారపత్రాన్ని అందుకున్నారని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఈ అధ్యాపకులను సోమవారం అభినందించారు.

ఎస్‌బీఐటీ, ఆర్జేసీ విద్యార్థులకు 'ప్లేస్‌మెంట్స్'

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఎస్‌బీఐటీ, ఆర్జేసీ కళాశాలల చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 24: ఆఫ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్, ఆర్జేసీ డిగ్రీ కళాశాలల చైర్మన్ గుండాల కృష్ణ సోమవారం తెలిపారు. ఎస్ఎల్ఎన్ బిల్డ్‌కాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లోని ఉద్యోగాలకు 13మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, కోజెంట్ ఈ సర్వీసెస్‌లోని ఉద్యోగాలకు ఏడుగురు డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. కాగా, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ జీ.ధాత్రి, ఎస్‌బీఐటీ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఆర్జేసీ ప్రిన్సిపాల్ ఏ.లింగయ్య, అధ్యాపకులు అభినందించారు.

గుండెపోటుతో శ్రీనివాస్ మృతి
– నివాళి అర్పించిన ప్రముఖులు

నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంరూరల్/మధిర, ఫిబ్రవరి 24 : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు(పీఏ) తక్కెళ్లపల్లి శ్రీనివాస్(52) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్‌జీఓస్ కాలనీలో ఉన్న శ్రీనివాస్ ఇంటికెళ్లి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ గడిచిన ఆరేళ్లుగా భట్టి విక్రమార్క వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నివాళి అర్పించిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు